nipuna
Every Wednesday Free Supplement
05.
23 అక్టోబర్ 2024
పేజీలు 8

**యుకీ బాంబ్రీ**

భారత టెన్నిస్ క్రీడాకారుడు యుకీ బాంబ్రీ ఫ్రెంచ్ క్రీడాకారుడు అల్బనో ఒలివెట్‌తో కలిసి స్విస్ ఓపెన్ ఏటీపీ 250 టూర్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. జూలై 21న జరిగిన ఫైనల్లో ఫ్రాన్స్‌కు చెందిన ఉగో హంబర్ట్–ఫాబ్రిస్ మార్టిన్ జోడీని ఓడించారు.

**సహజ:** యూఎస్ ఐటీఎఫ్ ఉమెన్స్ వరల్డ్ టూర్ మహిళల డబుల్స్‌లో తెలంగాణకు చెందిన సహజ ఎల్లంపల్లి రన్నరప్‌గా నిలిచింది. సహజ–హిరొకొ కువాటా (జపాన్) ద్వయం అలిసియా లినాన (స్పెయిన్)–మెలని క్రివోజ్ (అర్జెంటీనా) జోడీ చేతిలో ఓడింది.

# పరిశోధనల్లో వేగం - చంద్రుడిపై కాలు పెట్టడమే లక్ష్యం

గ్రూప్స్ ప్రత్యేకం
కరెంట్ అఫైర్స్

## కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు


- 2024, సెప్టెంబర్ 18న ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదించిన అంశాలు.

### 1) జమిలి ఎన్నికలు

- వీటిని 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు' అని పిలుస్తారు.
- వీటి నిర్వహణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి 2024, సెప్టెంబర్ 2న ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది.
- ఈ ఉన్నత స్థాయి కమిటీకి చైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వ్యవహరించారు. ఈ కమిటీలో 8 మంది సభ్యులు ఉన్నారు.
- పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని ఈ ఉన్నతస్థాయి కమిటీ సూచించగా దాన్ని ఆమోదించారు.
- తొలి దశలో పార్లమెంట్– అసెంబ్లీ ఎన్నికలను, అవి పూర్తయిన 100 రోజుల్లో రెండో దశలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కమిటీ సిఫారసుల మేరకు ఆమోదించారు.
- ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని ఎన్నికలకు ఒకే ఓటర్ జాబితాను ఉపయోగిస్తారు.
- దేశ వ్యాప్తంగా సవివరమైన చర్చలు ప్రారంభించి, అమలు కోసం ఒక గ్రూపును ఏర్పాటు చేయాలి.
- దేశ వ్యాప్తంగా 1951 నుంచి 1967 వరకు అన్ని ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించారు.
- అసెంబ్లీలు, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మేలని 1999లో తన 170వ నివేదికలో లా కమిషన్ సూచించింది.
- పార్లమెంటరీ కమిటీ 2015లో పార్లమెంటరీ కమిటీ తన 79వ నివేదికలో ఏకకాల ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించాలని సూచించింది.
- జమిలి ఎన్నికలపై నివేదిక సమర్పించిన కోవింద్ కమిటీ 7 దేశాల్లో అధ్యయనం చేసింది. అందులో దక్షిణాఫ్రికా, స్వీడన్, బెల్జియం, జర్మనీ, జపాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ ఉన్నాయి.
- జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ 62 పార్టీల అభిప్రాయాలను కోరింది. ఇందులో 47 పార్టీలు స్పందించాయి. అందులో 32 పార్టీలు అనుకూలంగా స్పందించగా, 15 పార్టీలు వ్యతిరేకించాయి. 15 పార్టీలు స్పందించలేదు.
- స్పందన తెలపని పార్టీల్లో తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఉన్నాయి.
- జమిలి ఎన్నికల నిర్వహణ కోసం 6 రాజ్యాంగ సవరణలు చేయాలి.

### 2) భారతీయ అంతరిక్ష కేంద్రం (BAS)

- భారతదేశ సొంత అంతరిక్ష కేంద్రం ఇది.
- దీని ఏర్పాటుకు శాస్త్రీయ పరిశోధనల కోసం 2028లో మొదటి మాడ్యూల్‌ను ప్రయోగించనున్నారు.
- గగన్‌యాన్ కార్యక్రమ పరిధిని విస్తరించడం ద్వారా భారతీయ అంతరిక్ష కేంద్రం మొదటి యూనిట్‌ను నిర్మించనున్నారు.
- గగన్‌యాన్ అనేది భారతదేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర. దీన్ని 2018, డిసెంబర్‌లో ఆమోదించారు.
- 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం పని ప్రారంభించడం, 2040 నాటికి భారతీయుడు చంద్రుడిపై కాలుపెట్టడం లక్ష్యం.



- గగన్‌యాన్ కార్యక్రమానికి మొత్తం నిధులు రూ.20,193 కోట్లకు చేరింది.

### 3) కొత్త తరం ప్రయోగ వాహక నౌక

- దీన్ని ఎన్‌జీఎల్‌వీ (నెక్ట్స్ జనరేషన్ లాంచ్ వెహికిల్) అంటారు.
- దీని అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- 2040 నాటికి చంద్రగ్రహం మీదకు భారతవ్యోమగాములను పంపించాలన్న ప్రభుత్వ దార్శనికతను సాకారం చేసే దిశగా ఈ నిర్ణయం ఒక ముఖ్యమైన అడుగు.
- ఎన్‌జీఎల్‌వీ ప్రస్తుతం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఉపయోగిస్తున్న ఎల్‌వీఎం3 రాకెట్ కంటే ఒకటిన్నర రెట్లు అదనపు ఖర్చుతో, మూడు రెట్లు అధిక పేలోడ్‌లను మోసుకెళ్లగలదు.
- ఎన్‌జీఎల్‌వీ ని భూమికి సమీప కక్ష్యలోకి గరిష్ఠంగా 30 టన్నుల బరువును మోసుకెళ్లేలా రూపొందిస్తున్నారు.
- ఎన్‌జీఎల్‌వీ రాకెట్‌లో మొదటి దశను పునర్వినియోగించుకోవచ్చు.
- ఎన్‌జీఎల్‌వీ రాకెట్ అభివృద్ధి దశ 96 నెలల్లోపు (8 సంవత్సరాలు) పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు ఎన్‌జీఎల్‌వీని 3 దశల్లో పరీక్షించనున్నారు.
- దీని కోసం రూ.8240 కోట్లు ఆమోదించారు.

### 4) శుక్రగ్రహ పరిశోధన

- దీన్ని వీనస్ ఆర్బిటర్ మిషన్ (వీవోఎం) అంటారు.
- శుక్ర గ్రహ అధ్యయనం కోసం ఉద్దేశించిన మిషన్ ఇది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది.
- భూమికి అతి సమీపంలో ఉన్న శుక్ర గ్రహం కూడా భూమి ఏర్పడిన పరిస్థితులను పోలిన వాటితో ఏర్పడిందని భావిస్తారు. భిన్నమైన వాతావరణాల్లో గ్రహాలు ఎలా ఏర్పడతాయో తెలుసుకునేందుకు ఈ పరిశోధన ఉపయోగపడుతుందని యోచిస్తున్నారు.
- కేంద్ర ప్రభుత్వ అంతరిక్ష విభాగం ఆధ్వర్యంలో రూపుదిద్దుకొనే వీనస్ ఆర్బిటర్ మిషన్ కింద ఒక స్పేస్‌క్రాఫ్ట్ శుక్ర గ్రహ కక్ష్యతో పరిభ్రమిస్తూ, శుక్ర గ్రహ ఉపరితలాన్ని, అంతరస్థరాన్ని, భూగర్భాన్ని, వాతావరణ పరిస్థితులను, శుక్రగ్రహం వాతావరణంపై సూర్యుడి ప్రభావం వంటి అంశాలను అధ్యయనం చేస్తుంది.
- ఈ మిషన్‌ను 2028, మార్చి నెల నాటికి పూర్తి చేయనున్నారు.
- ఈ మిషన్‌కు మొత్తం రూ.1236 కోట్లు కేటాయించగా, అందులో అంతరిక్ష నౌకా నిర్మాణానికి రూ.824 కోట్లు ఖర్చు చేస్తారు.

### 5) చంద్రయాన్-4

- కేంద్ర క్యాబినెట్ చంద్రయాన్–4కు ఆమోదం తెలిపింది.
- చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై వ్యోమనౌకను దింపి విజయం సాధించిన నేపథ్యంలో ఈ తాజా మిషన్‌కు ప్రణాళిక సిద్ధం చేసింది.
- చంద్రయాన్–4 మిషన్‌లో భాగంగా చంద్రుడి నుంచి నమూనాలతో వ్యోమనౌకను తిరిగి భూమికి రప్పించి వాటిని విశ్లేషించగల సాంకేతిక పరిజ్ఞానం రూపకల్పన, సామర్థ్య ప్రదర్శన లక్ష్యంగా ఉంది.
- దీన్ని పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో 36 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- కీలకమైన అన్ని సాంకేతిక పరిజ్ఞానాలను దేశీయంగా రూపొందిస్తారు.
- చంద్రయాన్–4కు రూ.2104.06 కోట్లు ఖర్చవుతుందని అంచనా.
- చంద్రయాన్–4 మిషన్ కోసం రెండు ఎల్‌వీఎం3 రాకెట్లను అభివృద్ధి చేస్తారు.
- ఎల్‌వీఎం3 అంటే లాంచ్ వెహికిల్ మార్క్3.
- ఎల్‌వీఎం3ను గతంలో జీఎస్‌ఎల్‌వీ–ఎంకేIII రాకెట్ అనేవారు.
- జీఎస్‌ఎల్‌వీ–ఎంకేIII అంటే జియోసిక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ మార్క్ త్రీ.

### 6. బయో రైడ్ పథకం

- బయో రైడ్ అంటే బయోటెక్నాలజీ రీసెర్చ్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ)కి సంబంధించిన ఒకే గొడుగు కింద ఉన్న రెండు పథకాలను విలీనం చేసి ఈ పథకం తీసుకురావడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- బయో మ్యానుఫ్యాక్చరింగ్, బయో ఫౌండ్రీ అనే రెండు కొత్త అంశాలు ఈ పథకంలో చేర్చారు.
- ఈ పథకంలో 3 భాగాలు ఉంటాయి. అవి..

  1) బయోటెక్నాలజీ పరిశోధన, అభివృద్ధి
  2) ఇండస్ట్రియల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్
  3) బయో మ్యానుఫ్యాక్చరింగ్, బయో ఫౌండ్రీ
- ఈ బయో రైడ్ పథకానికి 15వ ఆర్థిక సంఘ కాలంలో అంటే 2021–22 నుంచి 2025–26 వరకు వ్యయంగా రూ.9197 కోట్లుగా చెప్పారు.
- ఈ పథకం ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, బయో టెక్నాలజీ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి, బయో మ్యానుఫ్యాక్చరింగ్ బయో టెక్నాలజీ ప్రపంచానికి ఓ కరదీపికగా భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడానికి రూపొందించారు.
- ఇది పరిశోధనను వేగవంతం చేయడం, ఉత్పత్తి అభివృద్ధిని మెరుగుపర్చడం, విద్య పరిశోధన, పారిశ్రామిక రంగాల అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది.
- ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పర్యావరణ సుస్థిరత, స్వచ్ఛమైన ఇంధనం వంటి జాతీయ, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి బయో ఇన్నోవేషన్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునే కేంద్ర ప్రభుత్వ మిషన్‌లో ఈ పథకం ఓ భాగం.

### 7) పీఎం ఆశా పథకం కొనసాగింపు

- పీఎం ఆశా అంటే ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్.
- ఈ పథకం ఒకవైపు రైతులకు గిట్టుబాటు ధరల్ని అందిస్తూ, మరొకవైపు ప్రజలపై నిత్యావసర సరకుల ధరల భాగం పడకుండా చూస్తుంది. దీన్ని కొనసాగించడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది.
- ఈ పథకానికి 15వ ఆర్థిక సంఘం కాలానికి అంటే 2021–22 నుంచి 2025–26 వరకు రూ.35,000 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.
- రైతులకు, వినియోగదారులకు సమర్థవంతమైన సేవలందించడానికి ప్రభుత్వం ధరల మద్దతు పథకం (ప్రైస్ సపోర్ట్ స్కీం), ధరల స్థిరీకరణ నిధి (ప్రైస్ స్టెబిలేషన్ ఫండ్) పథకాలను పీఎం ఆశాలో కలిపింది.
- ఈ పథకంలో కింది విభాగాలుంటాయి.
  1) ధరల మద్దతు పథకం (ప్రైస్ సపోర్ట్ స్కీం)
  2) ధరల స్థిరీకరణ నిధి (ప్రైస్ స్టెబిలేషన్ ఫండ్)
  3) ధర లోటు చెల్లింపు పథకం (ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం)
  4) మార్కెట్ మధ్యవర్తిత్వ పథకం (మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం)

### 8) 2024 రబీ సీజన్‌కు ఎరువులపై పోషకాధారిత రాయితీ

- ఈ ఏడాది రబీ సీజన్ అంటే 2024, అక్టోబర్ 1 నుంచి 2025, మార్చి 31 వరకు ఫాస్ఫాటిక్ అండ్ పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై పోషకాధారిత రాయితీ (ఎన్‌బీఎస్) రేట్లను ఖరారు చేయాలన్న రసాయనాలు, ఎరువులు, మంత్రిత్వ శాఖ ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.
- ఈ ఏడాది రబీ సీజన్ కోసం అవసరమైన తాత్కాలిక బడ్జెట్ రూ.24,475.33 కోట్లు.
- దీని వల్ల రైతులకు రాయితీపై సరసమైన, సహేతుకమైన ధరలకు ఎరువులు అందుబాటులోకి వస్తాయి.
- అంతర్జాతీయ స్థాయిలో ఇటీవల ఎరువులు, పెట్టుబడి ధరల ధోరణుల దృష్ట్యా పీ అండ్ కే ఎరువులపై రాయితీని సవరిస్తున్నారు.
- ఎరువుల తయారీదారులు/ దిగుమతిదారుల ద్వారా ప్రభుత్వం 28 గ్రేడ్‌ల పీ అండ్ కే ఎరువులను రైతులకు రాయితీ ధరలకు అందుబాటులో ఉంచుతుంది.
- పీ అండ్ కే ఎరువులపై పోషకాధారిత రాయితీ పథకం ద్వారా 2010, ఏప్రిల్ 1 నుంచి రాయితీ అందిస్తున్నారు.

### 9) ప్రధాన మంత్రి జన్‌జాతీయ్ ఉన్నత్ గ్రామ్ అభియాన్

- దేశంలో గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన ప్రధాన మంత్రి జన్‌జాతీయ్ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- ఈ పథకం అమలుకు రూ.79,156 కోట్లు కేటాయిస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.56,333 కోట్లు, రాష్ట్రాల వాటా రూ.22,823 కోట్లు ఉంటుంది.
- దీన్ని గిరిజన గ్రామాలు, ఆకాంక్షిత జిల్లాల్లోని గిరిజన ఆవాస ప్రాంతాల్లో అమలు చేయనున్నారు.
- 2024–25 కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించినట్లు సుమారు 63,000 గ్రామాల్లోని 5 కోట్లకు పైగా గిరిజన ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.
- ఈ ప్రాజెక్టును 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 549 జిల్లాలు, 2740 బ్లాకుల్లో చేపట్టనున్నారు.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ఎస్టీ జనాభా 10.45 కోట్లు కాగా దేశ వ్యాప్తంగా 705కు పైగా ఆదివాసీ న్యాయ మహా అభియాన్ ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఇది సాధించే విజయం, దీని ద్వారా నేర్చుకున్న విషయాల ఆధారంగా గిరిజన సమజాతులను, ప్రాంతాలను సమగ్రంగా, సుస్థిరంగా ఈ ప్రధాన మంత్రి జన్‌జాతీయ్ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ద్వారా అభివృద్ధి చేయనున్నారు.
- ఈ మిషన్‌లో 25 రకాలుగా సహాయం అందనుంది.
- వీటిని 17 కేంద్ర మంత్రిత్వ శాఖలు అమలు చేస్తాయి.
- ఈ పథకం లక్ష్యాలను సాధించడానికి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కార్యాచరణ, ప్రణాళిక (డీఏపీఎస్టీ) కింద 5 సంవత్సరాలకు నిధులు కేటాయించారు.

**లక్ష్యాలు**

1) మౌలిక సదుపాయాల అభివృద్ధి
2) గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం
3) నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే దిశగా ప్రోత్సహించడం, మెరుగైన జీవనోపాధి
4) మంచి విద్య అందరికీ అందేలా చూడటం
5) ఆరోగ్యం

### 10) భారీ మార్పు దిశగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం

- యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (AVGC-XR) కోసం 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీవోఈ)' ఏర్పాటు చేయడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- దీన్ని కంపెనీల చట్టం–2013 కింద సెక్షన్ 8 కంపెనీగా ఏర్పాటు చేస్తారు.
- సెక్షన్ 8 కంపెనీ లాభాపేక్ష లేని సంస్థ అని అర్థం.
- ఎన్‌సీవోఈని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌సీసీఐ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీసీఐ)లో ఉన్న పరిశ్రమల భాగస్వామ్యంతో ముంబయిలో ఏర్పాటు చేస్తారు.
- దేశంలో ఏవీజీసీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక శాఖ 2022–23 బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- ఫిలిం మేకింగ్, ఓవర్ ది టాప్ (ఓటీటీ), గేమింగ్, వాణిజ్య ప్రకటనలు, ఆరోగ్యం, విద్య, ఇతర సామాజిక రంగాలతో సహా మొత్తం మీడియా, వినోద రంగంలో ఏవీజీసీ–ఎక్స్ఆర్ రంగం నేడు ఒక అనివార్యమైన పాత్ర పోషిస్తుంది.

**తాన్న రవి**
ఫ్యాకల్టీ
ఏకేఆర్ స్టడీసర్కిల్
వికారాబాద్
91107 62187

